

# చైతన్య స్రవంతి

సన్నపరెడ్డి కృష్ణారెడ్డి

## ఈ వారం కథ

మెయిన్ రోడ్‌లోంచి మలుపుతిరిగి గుడి వీధిలో అడుగుపెట్టగానే అవ్యక్తమూ, అనిర్వచనీయమూ అయిన మధురానుభూతి నా మన

సంతా పరచుకొంది.

పచ్చగా కళ్ళాపిజల్లి, రంగవల్లులు తీర్చిన ముంగిళ్ళూ, ప్రహరీ మీద మంచి రోడ్డు మీదికి వాలిన కొబ్బరాకులతో పచ్చటి లోగిళ్ళూ – వాటి మధ్య నడుస్తుంటే హాయిగా అనిపించింది.

జనవరి నెల కావటంతో ఏడు గంటలైనా ఇంకా చలిగానే వుంది. రెండు చేతులూ ఫ్యాంటుజేబుల్లో పెట్టుకొని, డిగ్రీలో వుండగా ఆ వీధిలో గడిపినప్పటి స్మృతుల్ని గుర్తుచేసుకొంటూ మెల్లిగా నడుస్తున్నాను.

మిగిలిన నగరమంతా అప్పటికీ, ఇప్పటికీ ఎంతో మారినా, ఆ వీధిలో మాత్రం మునుపటి ప్రశాంతతా, స్వచ్ఛతా అలాగే వున్నాయి.

వీధికి అటూ ఇటూ వున్న ఇళ్ళలో నాక్కావలసిన ఇంటి కోసం చూస్తూ తాపీగా నడవసాగాను. అప్పటికీ ఇప్పటికీ ఆ ఇళ్ళలో ఏ మాత్రం మార్పు రాలేదు. అప్పుడు ఖాళీగా వున్న ఒక ట్రెండు ప్లాట్లలో ఇళ్ళు వెలిశాయంతే.

కొంచెం ముందుకి నడిచాక కనిపించింది నేను వెతుకుతున్న పచ్చ మేడ. ఆ ఇంటిని చూడగానే నా మనసు ఓ క్షణం లయ తప్పింది. నా జీవితంలో ఎన్నో తీయని అనుభూతులు ఆ ఇంటితో ముడివేసుకొని వున్నాయి.

తలెత్తి చూశాను. డాబా మీది గది అలాగే వుంది. నేను డిగ్రీ చదువుతున్నప్పుడు అందులో మూడు సంవత్సరాలు గడిపాను.

తెరిచిన గేట్లోంచి లోపలికి చూశాను. అరవై ఏళ్ళకి కొంచెం అటూ ఇటూగా వున్న వ్యక్తి ఇంటి ముందు నిలబడి సూర్యనమస్కారాలు చేస్తున్నాడు.

మెడలో రుద్రాక్షమాల, నుదుటి మీద విబూది రేఖలు – మూర్తీభవించిన తేజస్సులా వున్న ఆయన్ని వెంటనే పోల్చుకున్నాను – సంగమేశ్వరశాస్త్రి.

లోపలికి తేరిపార చూశాను. మరెవ్వరూ కన్పించలేదు. అన్నపూర్ణమ్మగారు ఎలా వున్నారో... అవంతి పండక్కి వచ్చివుంటుందో లేదో?!

అవంతిని తల్చుకోగానే, అప్పటివరకూ అణచిపెట్టిన గతం తాలూకూ స్మృతులన్నీ ప్రవాహంలా విరుచుకుపడ్డాయి.

ఎనిమిదేళ్ళ క్రితం నేను మొదటిసారి ఆ లోగిలిలో చూసిన – చిలిపితనం, అమాయకత్వం కలగలిసి తీర్చిదిద్దిన పదహారేళ్ళ అవంతి కళ్ళ ముందు మెదిలింది.

ఎనిమిదేళ్ళ క్రితం, డిగ్రీ చదవటానికి తొలిసారిగా మా వూరు వదిలి విజయవాడ రావాల్సి వచ్చినప్పుడు మొదట బెంగపడ్డాను – బొత్తిగా తెలియని కొత్తచోటికి వెళ్తున్నందుకు.

నాన్నగారు వచ్చి సంగమేశ్వరశాస్త్రిగారిని పరిచయం చేసి, ఆయనింట్లోనే డాబా మీది గది అద్దెకి కుదిర్చి వెళ్ళారు. అద్దె తీసుకోవటానికి శాస్త్రిగారు ఒప్పుకోలేదు. బలవంతపెట్టిన మీదట నామమాత్రపు అద్దె నిర్ణయించారు. భోజనం కూడా తమింట్లోనే చేయమని బలవంతపెట్టాడాయన.

◆ స్పీడు ◆

"గంటకు 90 మైళ్ళ వేగంతో కారు నడుపుతున్నట్టు నీ మీద కేసు పెట్టబడింది" అన్నాడు జడ్జి ముద్దాయితో.

"నేనేం నేరం చేయలేదు సార్? చిన్నప్పటి నుంచీ ప్రతి పనికీ స్పీడు అలవాటు నాకు – అంతే" అన్నాడు ముద్దాయి.

"ఓహో... అలాగా? అయితే రెండు వారాల శిక్షని ఇరవై వారాలకి పొడిగిస్తున్నాను. ఈ శిక్షని ఎంత స్పీడుగా గడిపేస్తావో చూద్దాం" అన్నాడు నవ్వుతూ.

– భూక్యా గోపీనాయక్

కానీ నేను ఒప్పుకోలేదు. మెయిన్ రోడ్‌లోని ఓ మెస్‌లో చేసేవాడిని.

నెల తిరిగేసరికల్లా మొదట్లో వున్న బెరుకూ, కొత్తదనం పోయాయి.

నాది బిడియమో, రిజర్వుడునెస్సో తెలీదుకానీ, కాలేజీలో నేనెక్కువ మందితో స్నేహం పెంచుకోలేకపోయాను.

సాయంత్రం కాలేజీ ముగిసిన వెంటనే నేరుగా రూంకొచ్చేవాడిని. స్నానంచేసి ఆరుబయట కుర్చీలో కూర్చుని లెండింగ్ లైబ్రరీ నుంచి తెచ్చుకున్న ఆర్థర్ హెయిలీనో, సిడ్నీషెల్డాన్‌నో చదువుతూ గడిపేసేవాడిని. ఎనిమిదవగానే మెస్‌కెళ్ళి భోంచేయటం, రూంకొచ్చేటప్పుడు శాస్త్రిగారు పలుకరిస్తే ఆయన్తో కాసేపు కబుర్లు చెప్పటం, పైకొచ్చి క్లాసు బుక్సు చదువుకోవటం, మూడ్ బావోలేకపోతే దగ్గర్లో ఏదైనా ఇంగ్లీషు సినిమా వుంటే వెళ్ళటం – క్లుప్తంగా ఇలా వుండేది నా దినచర్య.

నేనా గదిలో ప్రవేశించిన రెండు వారాల తరువాత ఆ ఇంట్లో శాస్త్రిగారూ, ఆయన అర్ధాంగి అన్నపూర్ణమ్మ కాక మూడో వ్యక్తి కనిపించింది.

ఓ రోజు సాయంత్రం కుర్చీలో కూర్చుని నవల చదువుకొంటూండగా ఎవరో మెట్లెక్కి వస్తున్నట్టు గజ్జెల శబ్దం వినిపించింది. చప్పున నవల మూసి మెట్ల వంక చూశాను. ఘల్లు ఘల్లుమని కాలి అందెల రవళి... దాన్ననుసరించి పదహారేళ్ళ ప్రాయమున్న అపరంజి బొమ్మలాంటి యువతి మెట్లెక్కి పైకి వచ్చింది.

అప్పటి వరకూ యథాలాపంగా పైకి వస్తున్నదల్లా, నన్ను చూసి చప్పున వెనుదిరిగింది. నేను సంభ్రమంతో ఆమె వైపే చూస్తూండగా వడివడిగా కిందికి వెళ్ళిపోయింది.

తరువాత మెస్‌కి వెళ్ళేటప్పుడు ఇంటిలోపలికి తొంగి చూశాను. వరండాలో శాస్త్రిగారు ఏదో పుస్తకం చదువుకొంటూ కన్పించారు. మరోవైపు అన్నపూర్ణమ్మగారు ఏదో అల్లుతూ కన్పించారు. ఆ అమ్మాయి కన్పించలేదు.

భోంచేసి వచ్చాక మెట్లెక్కుతూ యధాలాపంగా తొంగిచూశాను. ఆ అమ్మాయి వరండాలో కూర్చుని ఏదో నోట్సు రాసుకుంటూ కన్పించింది. దాంతో పైకెళ్ళే ప్రయత్నం మానుకొని, కిందికి దిగివచ్చి,

"శాస్త్రిగారున్నారాండీ?" అనడిగాను ఆమెని.

ఆమె కళ్ళు పైకెత్తి చూసింది. పుస్తకం లోంచి తలెత్తకుండానే అలవోకగా కనురెప్పలు పైకెత్తి చూస్తూంటే – ఆ భంగిమలో ఆమె ఎంతో అందంగా కనిపించింది. ఆ అమ్మాయికి అంత అందమైన కళ్ళు ఇచ్చిన దేవుణ్ణి ఆ క్షణంలో మనసారా అభినందించాలనిపించింది.

"ఉన్నారు. కూర్చోండి" అని నాతో చెప్పి, లోపలికి చూసి "నాన్నగారూ" అని పిల్చింది. వయొలిన్ తీగెల మీద కమానుతో చేయి తిరిగిన సంగీతకారుడు సుతారంగా మీటితే రాలిపడ్డ సంగీతరవళిలా వుందామె కంఠం. ఆ క్షణంలో లతామంగేష్కర్ కూడా ఈ అమ్మాయి ముందు దిగదుడుపే అనిపించింది.

ఇంతలో శాస్త్రిగారు బయటకొచ్చి, "నువ్వా బాబూ! కూర్చో" అని, ఆమె వైపు తిరిగి, "నేను చెప్పానే కుమార్ అని... ఈ అబ్బాయే. డాబా మీది గదిలో వుంటున్నాడు. వీళ్ళ నాన్నగారూ, నేనూ స్నేహితులం" అని నన్ను పరిచయం చేసి, "తను మా అమ్మాయి. పేరు అవంతి. మా అన్నగారి వూరు వెళ్ళి వుండి ఇవాళే తిరిగి వచ్చింది" అన్నారు నాతో.

... ...

అప్పుడప్పుడే ఓణీలేయటం మొదలుపెట్టిందేమో ఆ

దుస్తుల్లో చూడముచ్చటగా వుండేది అవంతి.

ఆ రోజు నుంచి ప్రతి సాయంత్రం అవంతిని గమనించటం నా దినచర్యలో ఓ భాగమైపోయింది. మేడ మీద పిట్టగోడ కానుకొని ఇంటి వెనుక పెరట్లోకి చూస్తే ఏదో ఒక పనిజేసుకుంటూ కనిపించేది.

నడుస్తున్నప్పుడు లయబద్ధంగా వినిపించే అందెల రవళితో, వొయ్యారంగా అటూ ఇటూ వూగే వాల్జడతో మనోహరంగా వుండేదా అమ్మాయి.

వారం రోజుల వరకూ అవంతితో మాట్లాడే అవకాశం రాలేదు నాకు. ఎప్పుడైనా ఎదురుపడితే మౌనంగా పక్కకి తప్పుకొనిపోయేది. అది గర్వమో, స్త్రీ సహజమైన బిడియమో లేక ఆ అమ్మాయి స్వభావమో అర్థంకాలేదు.

వారం రోజుల తర్వాత ఓ సాయంత్రం తనే పైకొచ్చింది. ఆమె రావటం చూసి కొంచెం ఆశ్చర్యపోయాను.

కుర్చీలోంచి లేచి చిరునవ్వుతో "రండి... రండి" అంటూ ఆహ్వానించాను. ముంగురులు స్వేచ్ఛగా కదుల్తున్నాయి. చిలకాకుపచ్చ ఓణీలో, మేచింగ్ బ్లౌజుతో చాలా అందంగా వుంది. అసలే ఎర్రటి మేనిఛాయ అవటాన ఆమె ధరించిన పచ్చటి దుస్తులలో మరింత ప్రకాశవంతంగా కన్పిస్తోంది. నున్నటి చెక్కిళ్ళు, లేత గులాబీ రంగు పెదవులు, ఆమె మాట్లాడుతున్నప్పుడు తమాషాగా కదిలే చెవులకున్న జూకాలు – ఆమెనలాగే చూస్తూ వుండిపోవాలనిపించింది.

"ఏమండోయ్ కుమార్‌గారూ..." అన్న ఆమె పిలుపుతో వాస్తవంలోకొచ్చాను.

నా చేతిలోని నవల వంక చూసి "ఇంగ్లీషు నవలా?" అంది.

"అవును. అదర్ సైడ్ ఆఫ్ మిడ్ నైట్... చాలా బావుంటుంది."

"సిడ్నీ షెల్డాన్ కదూ?"

"అవును. మీరు చదివారా?"

"లేదు. మా పెదనాన్న చదువుతుంటే చూశాను."

ఆమె నించునే వుండటం చూసి, "అయామ్ సారీ. మిమ్మల్ని నించోబెట్టి మాట్లాడేస్తున్నాను. కుర్చీలో కూర్చోండి" అన్నాను.

"ఫర్వాలేదులెండి. అన్నట్టు మీ దగ్గర చాలా బుక్స్ వున్నాయటగా. నాన్నగారు చెప్పారు."


"మీకు కావాలా?"

తలూపింది.

"లోపలికి వెళ్దాం రండి. చూద్దురుగానీ" రూంలోకి నడిచాను. నా వెంటే లోపలికి వొచ్చింది

లైటూ, ఫ్యానూ వేసి "అలా కూర్చోండి" అన్నాను. కుర్చీలో కూర్చుంది.

రేక్‌లోంచి పాత వీక్లీలు, నాలుగైదు నవల్స్ తీసి ఆమె ముందు వేసి "తీసుకోండి" అన్నాను.



"ఇంగ్లీషు నవలలు చదవటం నా వల్ల కాదు బాబూ. తెలుగువి వుంటే ఇవ్వండి" అంది.

వెతికి, రెండు తెలుగు నవలలుంటే తీసిచ్చాను.

"చాలా థాంక్సండీ. వెళ్ళొస్తాను" పైకి లేచింది.

'కాస్సేపు వుండి వెళ్ళొచ్చుగా' అందామనుకొని ఆగిపోయాను – ఆమె ఎలా అర్థంచేసుకొంటుందో అని.

మృదుమధురంగా గజ్జెల శబ్దం చేస్తూ, విలాసంగా నడుచుకొని వెళ్ళిపోయింది.

ఆ తరువాత చాలాసార్లు వచ్చిందామె.

మొదట్లో తనక్కావల్సిన బుక్స్ తీసుకొని వెళ్ళిపోయేది. తరువాత్తరువాత కాస్సేపు అవీ ఇవీ మాట్లాడి వెళ్ళసాగింది. ఆమె జూనియర్ ఇంటర్ చదువుతూందని మాటల మధ్య తెలిసింది. బైపిసి గ్రూప్.

"డాక్టర్ కావాలనుకొంటున్నారా?" అడిగాను.

"అబ్బే అలాంటిదేం లేదు. ఆ మాటకొస్తే చదువులో నేను అంతంతమాత్రమే" అంది నవ్వుతూ.

"మరి బైపిసీ ఎందుకు తీసుకొన్నారు?"

కాస్సేపు ఆలోచించి, భుజాలు పైకిలేపి, పెదవి మెలిపెట్టి, కళ్ళు పెద్దవి చేసి చూస్తూ, "ఏమో!" అంది.

ఆ భంగిమని చాలా కాలం మర్చిపోలేకపోయాను నేను.

... ...

ఆ అమ్మాయిలో నన్ను ఎక్కువ ఆకట్టుకొన్నది – ఆమె కళ్ళు!

ఒకసారి నిర్మలంగా నవ్వుతున్నట్లుండే ఆ కళ్ళు మరొకసారి కొంటెగా నవ్వుతుంటాయి. ఓ క్షణంలో అమాయకత్వాన్ని నింపుకున్న ఆ కళ్ళు, మరో క్షణంలో చిలిపితనాన్ని సంతరించుకొంటాయి.

అసలే పెద్ద కళ్ళు కావటాన ఆమె కళ్ళలో ఎలాంటి భావమైనా ప్రస్ఫుటంగా కన్పించేది.

"ఇంత అందమైన కళ్ళని నా జీవితంలో ఇంతవరకూ చూడలేదు" – అని డైరీలో రాసుకున్నానో రోజు.

... ...

"నాయనా కుమార్! నువ్వో సహాయం చేయాలి బాబూ" అన్నారు శాస్త్రిగారు ఓ రోజు.

"ఏమిటో చెప్పండి" అన్నాను.

"మా అమ్మాయి ఇంగ్లీషులో పూర్. నువ్వు శ్రమగా భావించకపోతే రోజూ ఓ అరగంట దానికి గ్రామర్ చెప్పరాదూ."

ఆనందంతో ఎగిరిగంతేయాలనిపించింది నాకు.


"ట్యూషన్ పెట్టిద్దామనుకొన్నాను. ఇప్పటికే సైన్సు సబ్జెక్టులకి ట్యూషన్ తీసుకొంటూంది. మళ్ళీ ఇంగ్లీషుక్కూడా అంటే టైమ్ చాలదు" చెప్తున్నారాయన.

"దాందేముందిలెండి. నాకు తెలిసినంతవరకూ నేను చెప్తాను" అన్నాను ఆనందాన్ని దాచుకోవటానికి ప్రయత్నం చేస్తూ.

ఆ రోజు నుంచీ రోజూ సాయంత్రం ఓ అరగంట అవంతికి ఇంగ్లీషు గ్రామర్ చెప్పేవాణ్ని మేడ మీద. తను కింద నుంచి చాప తీసుకొస్తుంది. ఇద్దరం దాని మీద కూర్చునేవాళ్ళం – మధ్యలో పుస్తకాలు వేసుకొని.

నేను ఇంగ్లీషులో అంత ఎఫిషియెంట్ కాకపోయినా, జూనియర్ ఇంటరే కాబట్టి అవంతికి టీచ్ చేయటం కష్టమనిపించలేదు.

ఒక్కోసారి చెప్తూ చెప్తూ ఆమె వంకే తదేకంగా చూస్తుండిపోయేవాడిని. మధ్యలో తను తలెత్తి



పైకి చూస్తే మా చూపులు కలుసుకొనేవి. అవంతి చప్పున తల దించుకొంటుంది. ఆమె కళ్ళు సునుసిగ్గుతో మెరవటం నాకు స్పష్టంగా కన్పించేది.

పరాయి అమ్మాయితో అంత క్లోజ్‌గా మూవ్ కావటం అదే ప్రథమం కాబట్టి నాకా అనుభవం వింతగా అన్పించేది. టీనేజ్ కావటం వల్లనేమో హాయిగొలిపే మధురానుభూతి మనసుని గిలిగింతలు పెట్టేది.

రెండు సంవత్సరాలు అలా గడిచిపోయాయి. విజయవాడకొచ్చిన కొత్తలో ఒక్కో సంవత్సరం ఒక్కో యుగంలా గడపాలేమోనని భయపడ్డాను. కానీ ఇప్పుడు రెండు సంవత్సరాలు రెండు క్షణాల్లా గడిచిపోయాయి - థాంక్స్ టు అవంతి.

అవంతి ఇంటర్ సెకండ్ క్లాసులో పాసయింది. వాళ్ళ నాన్నగారు ఆమె కిష్టంలేకపోయినా మెడికల్ ఎంట్రన్స్ రాయించారు. ర్యాంక్ రాలేదు.

"రాదని నాకు ముందే తెలుసు" అంది అవంతి నవ్వుతూ.

"నువ్వు ఇంకొంచెం కష్టపడి చదివితే తప్పక వచ్చేది. ఈసారి గట్టిగా ట్రై చెయ్" అన్నాను.

"అసలు మెడిసిన్ చేరటం నా కిష్టంలేదు. జువాలజీలో ఫ్రాగ్స్‌ని కోస్తుంటేనే కంపరం వేసేది. ఆ శవాలని కోయటం అదంతా నా వల్ల కాదు బాబూ" నవ్వేసింది.

* * *

నాకు ఫైనలియర్ ఎగ్జామ్స్ అయిపోయాయి. ఊరికి బయల్దేరేముందు సామానంతా సర్దుకొంటుంటే మనసులో ఏదో దిగులు. కళ్ళముందు అవంతే మెదుల్తూంది. నేను నిజంగా ఆమెని ప్రేమిస్తున్నానా? లేక ఇదంతా ఇన్‌ఫాచ్యుయేషనేనా?

ఇంతలో అవంతి పైకొచ్చింది. ఎప్పటిలాగే గుండెలు ఆనందంతో నిండేలా గజ్జెల శబ్దం... దాని వెనకే తను.

"ఇప్పుడే వెళ్తున్నావా?" అడిగింది తలువుకాను కొని.

"చీకటి పడుతోంది కదా. రేపుదయం వెళ్తాను" అన్నాను పుస్తకాలు ప్యాక్ చేస్తూ.

జడ చివర్లని వేలికి చుట్టుకుంటూ కాస్సేపు మౌనంగా వుండిపోయింది.

"తరువాతేం చేద్దామనుకొంటున్నావ్?"

"ఏదైనా జాబ్‌లో చేరాలనుందినాకు. నాన్నగారేమో ఎమ్మెస్సీ చేయమంటున్నారు."

"మళ్ళీ ఇక్కడికి రావు కదూ?" ఆమె మాటల్లో దిగులు.

అంత బాధలోనూ నాకు ఆనందం అనిపించింది - నేను వెళ్ళిపోతుంటే ఆమెకి దిగులుగా వున్నందుకు.

సామాను సర్దటం ఆపి బయటికి నడిచాను. ఇద్దరం పిట్టగోడ కానుకొని నించున్నాం. చీకట్లు ముసురుకొంటున్నాయప్పుడే. డాబా మీదికి వాలిన కొబ్బరాకులు గాలికి వూగుతున్నాయి.

తలెత్తి ఆమె వైపు చూశాను. ఆమె నా వైపు చూస్తూండటం కనిపించింది. చప్పున ఆమె చేతిని అందుకొన్నాను. ఆమె అభ్యంతరపెట్టలేదు. ఆమె చేతిని అపురూపంగా రెండు చేతుల్తో పట్టుకొని వుండిపోయాను. ఆమె మౌనంగా ఎటో చూస్తోంది. మనసులోని భావాన్ని మాటలకన్నా మౌనమే బాగా కమ్యూనికేట్ చేయగలదనిపించింది నాకా క్షణంలో.

"అవంతీ! నన్ను మర్చిపోవు కదూ!" అడిగాను.

అడ్డంగా తలూపింది.

ఎదంగా నించుని వున్నా ఆమె సామీప్యంలో నా గుండె కొట్టుకోవటం నాకే తెలుస్తోంది. నా వంట్లో రక్తం వడివడిగా ప్రవహిస్తోంది. చేతులు సన్నగా కంపించసాగాయి.

ఆమె వైపు తదేకంగా చూశాను.

ఆ వెన్నెల వెలుగులో ఆమె బుగ్గలు ఎరుపెక్కటం తెలుస్తూంది. కొబ్బరాకుల్లోంచి వెన్నెల జాలువారి ఆమెని నిలువెల్లా ముంచుతోంది. ఆ వెన్నెల సోనల్లో స్నానం చేస్తూన్న ఆమె పెదవులు అదరటం స్పష్టంగా కన్పిస్తూంది.

ఒక అడుగు ముందుకేసి ఆమెకి మరింత దగ్గరయ్యాను.

అప్పుడే ఆకారం సంతరించుకొంటూన్న ఆమె ఎద నా ఛాతికి మృదువుగా తగిలింది.

వళ్ళు జలదరించింది.

నా వంట్లో ఏదో ప్రకంపనలు మొదలయ్యాయి. రక్తం వడిగా ప్రవహిస్తున్న అనుభూతి కలుగుతూంది. తియ్యగా, హాయిగా, మత్తెక్కించే ఓ అనుభూతి తరంగం నన్ను నిలువెల్లా ముంచెత్తింది.

చప్పున ముందుకి వంగాను.

ఆమె లేత పెదవుల ఎరుపుదనం మీద వెన్నెల కిరణం పడి వరావర్తనం చెందుతూంది. ఆ వెన్నెల వెలుగులో ఆమె పెదాల తడి మెరుస్తూంది.

నా చేతి మీద ఆమె చేయి బిగుసుకొంది.

తమకమో, తన్మయత్వమో ఆమె కళ్ళు మూసుకొంది.

నా పెదాలతో ఆమె పెదాలనందుకొని మృదువుగా వొత్తాను.

ఆనందపు తరంగాలు ఉవ్వెత్తున చెలరేగి మనసు తీరాన్ని ఢీకొంటున్నాయి. శరీరం గాల్లో తేలిపోతున్నట్లు వుంది.

అమృతం ఏమోగానీ, అధరామృతం రుచి ఆ క్షణంలో తెలిసింది.

మనసులో ఇదివరకటి తన్మయత్వం పోయి కోర్కె బుసలు కొట్టింది.

ఆమె వెనక్కి జరిగింది.

కాంక్షతో ముందుకి వంగాను.

"ప్లీజ్" అంది.

ఇంతలో "అవంతీ!" అని కింది నుంచి శాస్త్రి గారి పిలుపు.

దిగి వెళ్ళిపోయింది. ఆమె మిగిల్చిన అనుభూతి వెల్లువలో మునిగితేలుతూ అలాగే వుండిపోయాను.

... ...

నేను వెళ్తుంటే శాస్త్రి దంపతులు చాలా బాధపడ్డారు. "అప్పుడప్పుడూ వచ్చి కనిపిస్తూండు బాబూ" అన్నారు.

"తప్పకుండా వస్తుంటానండీ!" అన్నాను వారితో.

అవంతి వరండాలో నించుని చూస్తూ వుంది. కళ్ళతోనే చెప్పాను వెళ్ళొస్తానని.

* * *

ఆ తరువాత వారిని చూడటానికి వీలుకాలేదు. హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో జాబ్ దొరికింది. దాన్లో జాయినయ్యాను. మళ్ళీ ఇన్నాళ్ళకి, ఎనిమిది సంవత్సరాల తర్వాత వాళ్ళని - ముఖ్యంగా అవంతిని - చూడబోతున్నాను.

అవంతి ఇప్పుడెలా వుందో?

ఎదిగీ ఎదగని వయసులో ఆకర్షణనే ప్రేమ అని

◆ కథల కాణాచి ◆

నిర్మాతలకు కథలు అంటగట్టడంలో దిట్ట అనిపించుకున్న అతని భార్య ఒక రోజు సిటీ బస్‌లో వెళ్తున్నప్పుడు కొద్ది దూరంలో కనిపించిన ఓ థియేటర్ వంక చూసి, "ఆ హాలులో మా ఆయన కథ రాసిన సిన్మా ఆడుతూన్నట్లుంది," అంది.

పక్క సీటులో కూర్చొనున్న ఆమె స్నేహితురాలు "చాల్లే నీ బడాయి! బానర్ గాని, పోస్టర్లు గాని ఇక్కడికి స్పష్టంగా కనబడడం లేదు. మీ వారు రాసిన కథ అని ఎలా చెప్పగలవు?" అని క్షణమాగి "ఓహో! ఆ హాలు ముందు జనం




హడావిడి అట్టే లేదుగా? టిక్కెట్ కౌంటర్ల వద్ద కూడా జనం లేరేమో! నువ్వు చెప్పింది కరెక్టే అయి వుంటుంది!" అని చురక వేసింది.

కథకుని పత్ని ముఖం మాడిపోయినట్లయింది.

(జి.వి.జి.)

## తమిళ నేరానికి తెలుగుశిక్ష

**యథార్థగాథలు**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి అంటే, 1947 నాటికి, ఆంధ్రదేశానికి టంగుటూరి ప్రకాశం పంతులుగారు ముఖ్యమంత్రిగా వున్నారు. ఆయన మంత్రివర్గంలో కొన్ని రోజులపాటు (నెల కంటే తక్కువేనని జ్ఞాపకం) మంత్రిగా వున్నారు రామచంద్రపుర ప్రాంతానికి చెందిన బిక్కిన వెంకటరత్నంగారు. అసెంబ్లీకి పేట కద్రవ్ వెళ్ళి, అసెంబ్లీలో నిద్రపోయి, ఆయన అసెంబ్లీలో నవ్వులు పుట్టించిన సంగతి అలా వుండగా, ఓ మారు మరో విచిత్రమైన పని చేశారు.

ఆయనకి అంతగా తమిళం రాదు. ఆయన పి.ఏ.కి తమిళం తప్ప మరేం రాదు. ఏదో కొంత ఇంగ్లీషు వచ్చినా, అది అంతంత మాత్రమే. ఓ మారు స్వంతపనిమీద వెంకటరత్నంగారు రామచంద్రపురం వెళ్ళవలసి వచ్చింది. అంటే అసెంబ్లీ సమావేశాలకి హాజరు కాలేరు – మరి? శలవు పెట్టాలా? When Assembly meets no time. పొల్లు. అంటూ కొన్ని ఇంగ్లీషూ కొన్ని తమిళం కలిపి అడిగారు పి.ఎ.ని. "అసెంబ్లీ మీటింగు ఎప్పుడు? టైము తెలియదు. చెప్పు" అని అడిగారనుకున్నాడు పి.ఎ. వెంటనే అతను 'నేరం పత్తుమణి' అన్నాడు. ఓహో! అసెంబ్లీకి హాజరు కాకపోవడం నేరం అన్నమాట. మరి పది రూపాయిలు జుర్మానా చెల్లించాలన్న మాట, అనుకొని పది రూపాయిలు ఫైను చెల్లించబోయారు, మంత్రిగారు ముఖ్యమంత్రి ఛాంబర్‌లోకి వెళ్ళి. అప్పుడు టంగుటూరివారి రియాక్షన్, కోపం, అదంతా మరో కథ.

— పోలాప్రగడ

గట్టిగా నమ్మే ఆ రోజుల్ని తలుచుకొంటే నవ్వొస్తుంది ఇప్పుడు.

అయినా నా కెందుకో గట్టి నమ్మకం – అవంతి మనసులో ఏ మూలో నా మీద అప్పటి సాఫ్ట్ కార్నర్ అలాగే వుంటుందని!

గేటు తెరుచుకొని లోపలికి వెళ్తూ అవంతి కోసం కళ్ళతో గాలించాను – ఒకవేళ పెళ్ళయినా సంక్రాంతికి పుట్టింటికి వచ్చుంటుందన్న ఆశతో.

శాస్త్రిగారు తలెత్తి చూశారు. నన్ను పోల్చుకోలేకపోయారు.

"నేనండీ... కుమార్‌ని!"

"నువ్వా బాబూ? ఎలా వున్నావు? ఎప్పుడొచ్చావు? ఏం చేస్తున్నావు?" ప్రశ్న మీద ప్రశ్న సంధిస్తూ, లోపలికి తలపెట్టి "అన్నపూర్ణా! బయటికి రా! కుమార్ వొచ్చాడు" అంటూ కేక పెట్టాడు.

పెరట్లోంచి వడివడిగా వచ్చిందామె.

"కులాసానా బాబూ! అమ్మా నాన్నా బావున్నారా?" అడిగింది ఆప్యాయంగా.

"లోపలికి తీసుకెళ్ళవే! బయటే నించోబెట్టి మాట్లాడేస్తున్నావ్" ఆప్యాయంగా విసుక్కున్నారాయన.

"లోపలికి రా బాబూ! చేతిలో సూట్ కేసేమీ లేదేం?"

"క్లోక్ రూమ్‌లో పెట్టి వొచ్చానండీ!"

"అదేం బాబూ? ఇక్కడికి తీసుకురాలేకపోయావా? మేం పరాయి వాళ్ళమనేగా?"

"అబ్బే అదేం కాదండీ! అక్కగారి వూరెళ్తూ దార్లో దిగాను. చేతిలో సూట్‌కేసెందుకులెమ్మని అక్కడే వదేసి వొచ్చాను"

ఆమెతో మాట్లాడుతూ లోపలికి తొంగిచూశాను. అవంతి కన్పించలేదు.

"కూర్చోబాబూ! అన్నట్టు అవంతి కూడా పండక్కి వొచ్చింది. స్నానం చేస్తున్నట్టుంది" ఆమె చెప్పింది నేను అడిగేలోపు.

"అవంతికి పెళ్ళయిందాండీ?" అడిగాను కుర్చీలో కూర్చుంటూ.

"అయింది బాబూ! మూడేళ్ళవుతోంది. నీ అడ్రస్ తెలీక ఇన్విటేషన్ పంపలేదు."

"అవంతికి పిల్లలా అండీ?" అడిగాను – నేను ఎక్కువ ఆసక్తిని కనబరుస్తున్నానని ఆవిడెక్కడ అనుకొంటుందో అని మనసులో భయపడ్తూనే!

"ఇంకా లేరు బాబూ!"

ఇంతలో అవంతి లోపలికొచ్చింది.

తలస్నానం చేసి జుట్టు వొదులుగా ముడి వేసుకొంది. తల ఇంకా తడారలేదు. ఇస్త్రీ చేసిన తెల్లటి కాటన్ చీరలో నిండుగా కన్పిస్తూంది. మెడలో బంగారు గొలుసు, దాని చివర మంగళ సూత్రం పచ్చగా మెరుస్తున్నాయి. ఆమె అందం ఏ మాత్రం తగ్గలేదు. అయితే అప్పటిలా చిలిపిదనమూ, అమాయకత్వమూ లేవు. నిండు గోదారిలా వుందామె.

"బావున్నావా కుమార్? ఎప్పుడొచ్చావు" లాంటి కుశల ప్రశ్నలయ్యాక అన్నపూర్ణమ్మగారు లోపలికి వెళ్ళింది పనిచేసుకోవటానికి.

ఏం మాట్లాడాలో తెలియక "బావున్నారా?" అన్నాను.

"ఆ పిలుపేంటి కొత్తగా" నవ్వింది – గోదారి గలగలలా.

"పైన నా గది అలాగే వుందా?"

"అలాగే వుంది. నువ్వెళ్ళాక ఎవరికీ అద్దెకివ్వలేదు. చూస్తావా?"

తలూపాను.

"రా వెళ్దాం" మెట్ల మీదికి దారితీసింది.

వెనకే నడిచాను.

మంచుతెరల్ని కరిగిస్తూ నీరెండ మెల్లగా పరుచుకొంటూంది.

నా గది అలాగే వుంది. ఏ మాత్రం మారలేదు.

గది చూశాక బయటకొచ్చి పిట్టగోడకానుకొని నించున్నాం.

డాబానానుకొని కొబ్బరి చెట్టు అలాగే వుంది. కొబ్బరాకుల సందుల్లోంచి నీరెండ అవంతి మీద పడుతోంది. ఆ నీరెండలో పచ్చటి ఆమె శరీరం మరింత ప్రకాశవంతంగా మెరుస్తూంది.

అదేచోట నించుని ఎనిమిదేళ్ళ క్రితం నేను పొందిన అనుభవం నా కిప్పటికీ గుర్తుంది – అవంతికా సంఘటన ఇంకా గుర్తుందా?

తలెత్తి ఆమె వంక చూశాను.

ఆమె నుదుటి మీద సిందూరం ఎండలో ఎర్రగా మెరుస్తూంది.

స్త్రీ జీవితాన్ని గోదారితో పోల్చి ఎవరో రాసిన భావం గుర్తొచ్చింది నాకు ఆమెని చూస్తూంటే. అప్పటివరకూ కొండకోనల్లో స్వేచ్ఛగా పరుగులు తీసిన పిల్ల కాలువ మైదానంలోకి రాగానే విశాలమైన గోదారిగా మారి ప్రవహించినట్లు, పెళ్ళికి ముందు అల్లరిగా ఆడుతూ పాడుతూ గడిపేసిన కన్నెపిల్ల పెళ్ళికాగానే గంభీరత్వాన్ని సంతరించుకొంటుందట!

ఇప్పుడు అవంతిలో ఆ మార్పు స్పష్టంగా కన్పిస్తోంది.

"ఏమిటలా చూస్తున్నావ్?" నవ్వింది అవంతి.

ఆమె నవ్వులో మునుపటి చిలిపితనం లేదు.

ఎవరికో అర్ధాంగి అయిన ఆ గృహిణికి, ఎప్పుడో ఎనిమిదేళ్ళ క్రితం ఎదిగీ ఎదగని వయసులో, యవ్వన ప్రాంగణంలోకి అడుగుపెడుతున్న తొలి దినాలలో నేను దొంగిలించిన తొలి ముద్దు గురించి గుర్తుచేయాలనిపించలేదు.

"ఏమిటీ ఏం మాట్లాడవు?" చేయి పట్టుకొని వూపింది అవంతి.

"ఏం లేదు. పద"

మెట్లు దిగి వచ్చాం.

"ఇక నేను వెళ్తానండీ" చెప్పాను శాస్త్రిగారితో.

"అదేం నాయనా? అప్పుడే వెళ్ళిపోతేనేం... రెండు దినాలుండి వెళ్దువుగాని" అన్నారాయన.

"ఇప్పుడే వెళ్ళిపోతేనేం కుమార్? సాయంత్రం మావారొస్తారు. పరిచయం చేస్తాను. రేపు వెళ్ళొచ్చు" అంది అవంతి.

"నాకు అర్జెంటు పనులున్నాయి. ఈసారి వొచ్చినప్పుడు వుంటాన్లే"

వాళ్ళ దగ్గర వీడ్కోలు తీసుకుని బయటికి వచ్చాను. గేటు దగ్గరికి వచ్చి ఆగి వెనక్కి తిరిగి చూశాను.

అవంతి చిరునవ్వు నవ్వుతూ చేయి వూపింది.

"కళ్ళతో వెళ్ళొస్తానని చెప్పటానికి ఆమె మునుపటి అవంతి కాదు. తల వొంచుకొని ముందుకి నడిచాను.

*